
సాక్షి తూర్పుగోదావరి

సోమవారం । 1 । మే । 2023



శ్రీకారం చుట్టుకుంది పెళ్లి ఉత్సవం


అన్నవరం సత్యదేవుని కల్యాణ వేడుకలు ఆదివారం ప్రారంభమయ్యాయి. అమ్మ వారిని, స్వామి వారిని వధూవరులను చేసే వేడుక అట్టహాసంగా నిర్వహించారు. - 8లో



ప్రకృతి ఒడిలో విడిది

ప్రముఖ పర్యాటక కేంద్రం కోరంగి అభయారణ్యాన్ని సందర్శించే పర్యాటకుల కోసం అటవీ శాఖ ప్రత్యేక హట్‌లను (వసతి గృహాలు) అందుబాటులోకి తీసుకొచ్చింది. - 8లో

డెల్టాలకు నీటి విడుదల నిలిపివేత



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు నీటి విడుదలను ఆదివారం సాయంత్రం నిలిపివేశారు. మార్చి 30 నుంచి నీటి విడుదలను నిలిపివేయాల్సి ఉండగా, శివారులో రబీ సాగు పూర్తి కాకపోవడంతో మరో నెల రోజులు పొడిగించారు.

న్యూస్‌రీల్

19న హెచ్‌సీఎల్ డ్రైవ్

రాజమహేంద్రవరం రూరల్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ), ఇంటర్మీడియెట్ విద్యామండలి, ఆంధ్రప్రదేశ్ సమాచార సాంకేతిక అకాడమీ (ఏపీఐటీఏ), హెచ్‌సీఎల్ సంయుక్త ఆధ్వర్యాన ఈ నెల 19న రాజమహేంద్రవరం ఆదిత్య డిగ్రీ కళాశాలలో హెచ్‌సీఎల్ డ్రైవ్ నిర్వహించనున్నారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎం.కొండలరావు ఆదివారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. 2020–21, 2021–22, 2022–23 సంవత్సరాల్లో ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులై, ఎంపీసీలో 60 శాతం, గణితంలో 60 శాతం మార్కులు వచ్చిన వారు దీనికి అర్హులు. ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహిస్తారు. అర్హత సాధించిన వారికి ఏడాది పాటు ఇంటర్న్‌షిప్ ద్వారా నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇచ్చి, ఉద్యోగావకాశం కల్పిస్తారు. బిట్స్ పిలాని, శస్త్ర, అమిటి వంటి ప్రముఖ యూనివర్సిటీల్లో ఉన్నత చదువులకు అవకాశం ఉంటుంది. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ముందుగా రిజిస్ట్రేషన్ లింక్ bit.ly. techbee22లో వివరాలు నమోదు చేసుకోవాలి. వివరాలకు 79012 84277, 83093 67771 ఫోన్ నంబర్లలో సంప్రదించాలి.

నేటి నుంచి పింఛన్ల పంపిణీ

రాజమహేంద్రవరం రూరల్: వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ జిల్లాలో సోమవారం ప్రారంభం కానుంది. డీఆర్‌డీఏ వైఎస్సార్ క్రాంతిపథం ప్రాజెక్టు డైరెక్టర్ సిరిపురపు సుభాషిణి ఆదివారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. జిల్లావ్యాప్తంగా 2,34,718 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం రూ.64.70 కోట్లు విడుదల చేసిందన్నారు. వేలిముద్రలు పడని అవ్వాతాతలకు ఆధార్ ముఖగుర్తింపుతోనూ పింఛన్ అందజేస్తామని తెలిపారు.

విజిలెన్స్ ఇన్‌చార్జి ఎస్పీగా కరణం కుమార్



విజిలెన్స్ ఇన్‌చార్జి ఎస్పీ కుమార్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా విజిలెన్స్ ఇన్‌చార్జి ఎస్పీగా కరణం కుమార్ రాజమహేంద్రవరంలోని కార్యాలయంలో ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకూ ఆయన ఏలూరు రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీగా పని చేసేవారు. రాజమహేంద్రవరంలో విజిలెన్స్ ఎస్పీగా ఇప్పటి వరకూ పని చేసిన పీవీ రవికుమార్ ఉద్యోగ విరమణ చేయడంతో విజిలెన్స్ డైరెక్టర్ జనరల్ రవిశంకర్ అయ్యన్నార్ ఆదేశాల మేరకు కుమార్‌కు ఆ బాధ్యతలు అప్పగించారు. ఉద్యోగ విరమణ చేసిన రవికుమార్‌ను కార్యాలయ సిబ్బంది ఘనంగా సత్కరించారు.


నేడు వైఎస్సార్ సీపీ సమావేశం

కొవ్వూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మే 5న కొవ్వూరు పర్యటనకు రానున్న నేపథ్యంలో సోమవారం వైఎస్సార్ సీపీ సమావేశం నిర్వహించనున్నట్టు రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత ఆదివారం తెలిపారు. ఉదయం 11 గంటలకు పట్టణంలోని క్యాంపు కార్యాలయం వద్ద ఈ సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు. నియోజకవర్గంలో పార్టీకి చెందిన ఎంపీపీలు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, కౌన్సిలర్లు, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు, పార్టీలో వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, కార్యకర్తలు ఈ సమావేశానికి కచ్చితంగా హాజరు కావాలని సూచించారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి బహిరంగ సభకు సంబంధించి పార్టీ నాయకులతో సమీక్షిస్తామని తెలిపారు.

కాంద్రకోటలో భక్తుల రద్దీ



అమ్మవారి దర్శనానికి క్యూలలో వేచి ఉన్న భక్తులు



నూకాలమ్మ అమ్మవారు

పెద్దాపురం: భక్తులు కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మండలం కాంద్రకోట నూకాలమ్మ అమ్మవారి ఆలయం ఆదివారం కిటకిటలాడింది. ఏటా కొత్త అమావాస్యను పురస్కరించుకుని సుమారు 45 రోజుల పాటు ఇక్కడ జాతర నిర్వహిస్తారు. ఇందులో భాగంగా ఆఖరి వారం కావడంతో అమ్మవారి దర్శనానికి వేలాదిగా భక్తులు దూర ప్రాంతాల నుంచి తరలివచ్చారు. రెండున్నర గంటలు పైగా క్యూలలో వేచి ఉండి, మొక్కులు చెల్లించుకుని, అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ గవరసాని వీరాస్వామి, ఈఓ తలాటం వెంకట సూర్యనారాయణ ఆధ్వర్యాన భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. సీఐ అబ్దుల్ నబీ పర్యవేక్షణలో ఎస్సై వెలుగుల సురేష్ బందోబస్తు ఏర్పాటు చేశారు. పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యాన భక్తులకు మజ్జిగ, పాలు పంపిణీ చేశారు.

సామాన్యులకు ఇసుక రీచ్

- ఉమ్మడి జిల్లాలో పుష్కలంగా ఇసుక నిల్వలు
- అందుబాటులో 1.54 లక్షల మెట్రిక్ టన్నులు
- 15 స్టాక్ యార్డుల ద్వారా సరఫరా
- అందరికీ అందుబాటులో ఉండేలా చర్యలు
- మరో 10 కొత్త రీచ్‌లకు ప్రతిపాదనలు
- సరఫరాపై మైనింగ్ అధికారుల దృష్టి



పెరవలి మండలం తీపర్రులోని ఇసుక రీచ్

సాక్షి, రాజమహేంద్రవరం: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు ఊపందుకున్నాయి. నాడు–నేడు పథకం కింద ఆస్పత్రులు, పాఠశాల భవనాల పనులు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయి. రానున్న మూడు నెలలూ నిర్మాణ రంగానికి అత్యంత కీలకం. వర్షాకాలంలో గోదావరి వరదల కారణంగా ఇసుక తవ్వే పరిస్థితి ఉండదు. ఈ పరిణామాలను దృష్టిలో ఉంచుకున్న ప్రభుత్వ యంత్రాంగం ప్రస్తుత అవసరాలకు ఇసుక సరఫరా చేస్తూనే.. వర్షాకాలానికి సరిపడా నిల్వ చేసేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపడుతోంది. ఇందుకోసం కొత్త రీచ్‌లకు అనుమతులు ఇచ్చే ప్రక్రియకు శ్రీకారం చుట్టింది.

ఉమ్మడి 'తూర్పు'లో..

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా తాతపూడి, కపిలేశ్వరపురంలో 2, ఆలమూరు, సోంపల్లి, వైపీ పాలెం, పిల్లంక 2, గోవలంక గ్రామాల్లో 9 ఓపెన్ ఇసుక రీచ్‌లు, 15 స్టాక్ పాయింట్లు ఉన్నాయి. అలాగే కొవ్వూరులో 2 రీచ్‌లు, ఒక స్టాక్ యార్డ్, నిడదవోలులో 3 రీచ్‌లు, గోపాలపురంలో 1 ఉన్నాయి. వీటి ద్వారా ప్రభుత్వ, ప్రైవేటు, ప్రజల అవసరాలకు ఇసుక సరఫరా చేస్తున్నారు. ఇసుక కొరత తలెత్తకుండా చర్యలు తీసుకుంటూనే భవన నిర్మాణ పనులకు ఇబ్బందులు లేకుండా లబ్ధిదారులు కోరినంతా అందిస్తున్నారు. జగనన్న ఇళ్ల నిర్మాణం, నాడు–నేడు, ప్రభుత్వ భవన నిర్మాణ పనులకు తొలి ప్రాధాన్యం ఇస్తున్నారు. కాంట్రాక్టర్లు ఆన్‌లైన్‌లో బుక్ చేసిన వెంటనే ఇసుక అందజేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

వర్షాకాలానికి ముందస్తు సన్నద్ధత

వర్షాకాలంలో తూర్పు గోదావరి, కోనసీమ, కాకినాడ జిల్లాల్లో వరుణుడి ప్రభావం ఎక్కువగా ఉంటుంది. గోదావరి వరదలకు లంక గ్రామాల్లో నీరు చేరుతుంది. వరదల కారణంగా గోదావరి ఓపెన్ ఇసుక రీచ్‌లలో ఇసుక వెలికితీత ఇబ్బందికరంగా మారుతుంది. ఫలితంగా గృహ నిర్మాణాలు, అభివృద్ధి పనులకు ఇసుక అందించడం కష్టమవుతుంది. విపత్తుల సమయంలో ఇసుక కొరతను అధిగమించేందుకు అధికార యంత్రాంగం ముందస్తుగా సన్నద్ధమవుతోంది. డిమాండ్‌కు అనుగుణంగా ఇసుక నిల్వలు ఉంచేందుకు కసరత్తు ప్రారంభించింది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా కొత్తగా మరో 10 ఇసుక రీచ్‌లకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. జిల్లా స్థాయి కమిటీ ఆమోద ముద్ర పడగానే ఇవి ప్రారంభం కానున్నాయి.

పక్కాగా పర్యవేక్షణ

ఇసుక సరఫరాను మైనింగ్, రెవెన్యూ, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు పర్యవేక్షిస్తున్నారు. ఇసుక సరఫరాలో పారదర్శకతకు పెద్దపీట వేస్తున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరకే నాణ్యమైన ఇసుక అందజేస్తున్నారు. అధిక రేట్లకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటున్నారు. ఉమ్మడి జిల్లాలో 15 ఇసుక డిపోలున్నాయి. వీటిలో 1.54 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వలున్నట్టు అధికారిక లెక్కలు స్పష్టం చేస్తున్నాయి.

ఉమ్మడి తూర్పులో ఇసుక నిల్వలు (మెట్రిక్ టన్నుల్లో)

ఇసుక డిపో	అందుబాటులో ఉన్న ఇసుక
లాలాచెరువు	52,150
కాతేరు	56,100
రాచపల్లి	8,006
గండేపల్లి	12,004
జెడ్.రాగంపేట	0
కాకినాడ పోర్ట్	0
జగన్నాథపురం	3,100
పెద్దాపురం	150
బోడసకుర్రు	0
అమలాపురం	0
ఆలమూరు	3,150
వద్దిపర్రు	0
రావులపాలెం	8,100
చక్కలపాలెం	12,150
పసలపూడి	0

ఇసుక నిల్వకు ప్రాధాన్యం

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా అందరికీ ఇసుక అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. పారదర్శకంగా, ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే అందిస్తున్నాం. అన్ని యార్డుల్లో ఇసుక నిల్వలు ఉండేలా చూస్తున్నాం.

– ఇ.నరసింహారెడ్డి, ఏడీ, మైనింగ్, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా

యుద్ధ ప్రాతిపదికన..

- విద్యుత్ సరఫరా పునరుద్ధరణ
- సీతంపేట, మద్దూరులంకకు 24 గంటల అనంతరం సరఫరా
- ప్రత్యామ్నాయం లేక రూ.8 లక్షలతో కొత్త లైన్ ఏర్పాటు



సీతంపేట – మద్దూరులంక గ్రామాలకు కొత్త విద్యుత్ లైన్ వేస్తున్న కార్మికులు



కొత్తగా వేస్తున్న విద్యుత్ స్తంభాలు

కొవ్వూరు: ఈదురు గాలుల ప్రభావంతో దెబ్బ తిన్న విద్యుత్ వ్యవస్థను అధికారులు యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరించారు. కొవ్వూరు, నిడదవోలు సబ్ డివిజన్ల పరిధిలో శనివారం వీచిన ఈదురు గాలుల తీవ్రతకు ఏకంగా 44 విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. నాలుగు ట్రాన్స్‌ఫార్మర్లు పాక్షికంగా దెబ్బ తిన్నాయి. ప్రత్యామ్నాయ లైన్ల ద్వారా ఆయా గ్రామాలకు యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. కొవ్వూరు మండలం మద్దూరులంక, సీతంపేట గ్రామాలకు విద్యుత్ సరఫరా చేసే లైను వరి పొలాల మీదుగా ఉంది. ఈ లైనులో అనేకచోట్ల స్తంభాలు పంట పొలాల్లో కూలిపోయాయి. దీంతో ఈ రెండు గ్రామాలకూ శనివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఈ గ్రామాలకు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా విద్యుత్ సరఫరా చేసే అవకాశం లేకపోవడంతో అధికారులు వెంటనే రూ.8 లక్షలు వెచ్చించి 14 స్తంభాలు వేశారు. కిలోమీటరు పొడవున కొత్త లైను వేశారు. 25 మంది కార్మికులు, స్తంభాలు నిలబెట్టే క్రేన్లు, గోతులు తీసే డ్రిల్లింగ్ యంత్రాలను వినియోగించి 24 గంటల అనంతరం ఆదివారం సాయంత్రానికి సరఫరాను పునరుద్ధరించారు. ఈ గ్రామాల్లో తాగునీటి సరఫరాకు సమస్య తలెత్తకుండా జనరేటర్లు ఏర్పాటు చేశామని ఎంపీడీఓ కె.ప్రసన్న కుమార్ తెలిపారు. ఈ గ్రామాలను ఇన్‌చార్జ్ డీఎల్‌పీఓ జి.సతీష్ సందర్శించారు. ఇదిలా ఉండగా ఆదివారం సాయంత్రం నుంచి మళ్లీ ఈదురు గాలులు వీస్తుండటంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. జిల్లా వ్యాప్తంగా రైతులు కళ్లాల్లోనే ధాన్యం ఆరబెట్టుకున్నారు. రెండు రోజుల నుంచి మారిన వాతావరణంతో వారు బెంబేలెత్తుతున్నారు.

11.3 మిల్లీమీటర్ల వర్షపాతం

జిల్లావ్యాప్తంగా శనివారం ఉదయం 8 నుంచి ఆదివారం ఉదయం 8 గంటల వరకూ 11.3 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. గరిష్ఠంగా నిడదవోలు మండలంలో 53.6 మిల్లీమీటర్లు కురిసిందని అధికారులు తెలిపారు. ఉండ్రాజవరం 27.2, పెరవలి 17.8, గోపాలపురం 34.6, అనపర్తి 32.6, కడియంలో 13.6 మిల్లీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది. కొవ్వూరు, రాజమహేంద్రవరం అర్బన్, సీతానగరం మినహా అన్నీ మండలాల్లోను చెదురుమదురుగా చినుకులు పడ్డాయి. వీటితోడు ఈదురు గాలులు వీయడంతో అరటి తోటలు, కోత దశలో ఉన్న వరి చేలు నేలకొరిగాయి.

సీఎం సభకు చురుకుగా ఏర్పాట్లు



సభా ప్రాంగణంలో చురుకుగా సాగుతున్న పనులు

కొవ్వూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మే 5వ తేదీన కొవ్వూరు రానున్న నేపథ్యంలో అధికారులు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్ర స్థాయిలో ఇక్కడ నిర్వహిస్తున్న 'వలంటీర్లకు వందనం' కార్యక్రమంలో సీఎం పాల్గొంటున్న విషయం తెలిసిందే. నెల రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమాన్ని ఆయన కొవ్వూరులో ప్రారంభించనున్నారు. ఉత్తమ సేవలు అందించిన వలంటీర్లకు నగదు పారితోషికాలు, అవార్డులు ఇచ్చి సత్కరించనున్నారు. ఈ సందర్భంగా కొవ్వూరులో జరిగే బహిరంగ సభలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొంటారు. స్థానిక సత్యవతి నగర్‌లో మంత్రి క్యాంపు కార్యాలయం ఎదురుగా ఉన్న మైదానంలో ఈ బహిరంగ సభ జరగనుంది. సభా ప్రాంగణాన్ని చదును చేసే పనులను అధికారులు చురుకుగా నిర్వహిస్తున్నారు. పొక్లెయిన్, జేసీబీ సాయంతో మైదానంలో ఉన్న మట్టి దిబ్బలను తొలగించే పనులు ఆదివారం చేపట్టారు. ఈ పనులు దాదాపు పూర్తయ్యాయి. పరిసరాలను శుభ్రం చేసే పనులు కొనసాగుతున్నాయి. బైపాస్ రోడ్డులో బుద్ధుడు జంక్షన్ వద్ద ఉన్న ఖాళీ స్థలంలో హెలిప్యాడ్, అప్రోచ్ రోడ్డు నిర్మాణాలు కూడా ఇప్పటికే పూర్తి చేశారు. మరోవైపు సభా ప్రాంగణంలో వేదిక నిర్మాణానికి సంబంధించిన సామగ్రితో కార్మికులు కొవ్వూరు చేరుకున్నారు. చలువ పందిళ్ల నిర్మాణం సోమవారం ప్రారంభించనున్నట్లు ఏపీ భూదాన్ యజ్ఞ బోర్డు చైర్మన్ తాడి విజయభాస్కరరెడ్డి తెలిపారు. సభా ఏర్పాట్లను ఆయన దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. మున్సిపల్ కమిషనర్ బి.శ్రీకాంత్, ఏఈలు దుర్గా కిషోర్, సిబ్బంది పారిశుధ్యం, ఇతర ఏర్పాట్లు చూస్తున్నారు. రాత్రి పూట కూడా పనులు కొనసాగేందుకు వీలుగా జనరేటర్లు, విద్యుద్దీపాలు ఏర్పాటు చేశారు.

చినవెంకన్న బ్రహ్మోత్సవాలు ప్రారంభం

- వధూవరులుగా దర్శనమిచ్చిన అమ్మవార్లు, శ్రీవారు
- ఘనంగా గజవాహన సేవ



అమ్మవార్లను, శ్రీవారిని వధూవరులను చేస్తున్న పండితులు

ద్వారకా తిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రం ద్వారకా తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారి వైశాఖ మాస దివ్య బ్రహ్మోత్సవాలు ఆదివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. నుదుటన కల్యాణ తిలకం.. బుగ్గన చుక్కలతో సర్వాభరణ భూషితుడైన శ్రీవారు పెండ్లి కుమారుడిగా, పద్మావతి, ఆండాళ్ అమ్మవార్లు పెండ్లి కుమార్తెలుగా శోభిల్లారు. తొలుత శ్రీహరి కళాతోరణ వేదికపై ఈఓ వి.త్రినాథరావు జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. స్వామివారి నిత్యకల్యాణ మండపంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికను సుగంధభరిత పుష్పమాలికలు, మామిడి తోరణాలతో శోభాయమానంగా అలంకరించారు. వేదికపై ఏర్పాటు చేసిన రజిత సింహాసనంపై స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను వేంచేయించి, పుష్పాలంకరణ చేశారు. ఆ తరువాత మేళతాళాలు, మంగళ వాయిద్యాల ఘోష, అర్చకులు, పండితుల వేద మంత్రోచ్చారణల నడుమ స్వామి, అమ్మవార్లను పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలుగా అలంకరించే వేడుక నేత్రపర్వంగా జరిగింది. స్వామి, అమ్మవార్లకు ఈఓ త్రినాథరావు దంపతులు పూలు, పండ్లు సమర్పించి, పూజాదికాలు నిర్వహించారు. భక్తుల గోవింద నామస్మరణల నడుమ ఈ వేడుక వైభవంగా జరిగింది. శ్రీహరి కళాతోరణ వేదికపై నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను అలంకరించాయి. రాత్రి గజ వాహనంపై స్వామివారి తిరువీధి సేవ వైభవంగా జరిగింది. బ్రహ్మోత్సవాల తొలి రోజున స్వామివారు శ్రీ, భూ సమేత మహావిష్ణువు అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ముఖ మండపంలో విశేష అలంకరణలో కొలువైన చినవెంకన్నను, అమ్మవార్లను పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకున్నారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

ఉదయం 8.00: భజనలు
10.00: భక్తిరంజని
సాయంత్రం 4.00: నాదస్వర కచేరీ
6.00: ప్రవచనాలు
7.00: కూచిపూడి, భరతనాట్య ప్రదర్శనలు
7.00: అంకురార్పణ, ఋత్విగ్వరుణ, ధ్వజారోహణం
8.00: భరతనాట్య ప్రదర్శనలు
9.00: హంసవాహనంపై శ్రీవారి తిరువీధి సేవ
శ్రీవారి ప్రత్యేక అలంకారం: కాళీయ మర్దనం

ఆటాడుకుందాం.. రా..



- నేటి నుంచి వేసవి క్రీడా శిబిరాలు
- 20 రకాల ఆటల్లో నెల రోజుల పాటు శిక్షణ
- 16 ఏళ్లలోపు బాలబాలికలకు అవకాశం

కొవ్వూరు: విద్యార్థులకు అన్ని రకాల పరీక్షలు ముగియడంతో సోమవారం నుంచి వేసవి సెలవులు ప్రకటించారు. ఈ సెలవుల్లో విద్యార్థుల సమయం వృథా కాకుండా ఉండేందుకు ప్రభుత్వం వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) ఆధ్వర్యాన సోమవారం నుంచి వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు ప్రారంభం కానున్నాయి. ఆసక్తి ఉన్న పదహారేళ్ల లోపు బాలబాలికలకు ఈ నెల 31 వరకూ 20 క్రీడాంశాల్లో అనుభవజ్ఞులైన వ్యాయామోపాధ్యాయులతో ఉచిత శిక్షణ అందించనున్నారు. ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా 50 క్రీడా శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేశారు. పిల్లలు తమ ఆసక్తిని బట్టి ఆయా క్రీడల్లో శిక్షణ పొందవచ్చు. ప్రతి రోజూ ఉదయం 6 నుంచి 8 వరకూ, సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకూ ఈ శిక్షణ ఇస్తారు. శిక్షణ కేంద్రాలకు అవసరమైన క్రీడా సామగ్రిని శాప్ ద్వారా సరఫరా చేస్తారు. ఈ శిబిరాల్లో మంచి ప్రతిభ చూపిన క్రీడాకారులను ఎంపిక చేసి, వివిధ స్థాయిల్లో నిర్వహించే పోటీలకు సైతం పంపిస్తారు. శిక్షణ అనంతరం ప్రతి విద్యార్థికి సర్టిఫికెట్, ప్రశంసా పత్రం అందిస్తారు.

క్రీడ.. శిక్షణ కేంద్రం.. సెల్ నంబర్

ఆర్చరీ: రాజమహేంద్రవరం ఏకే కళాశాల (63015 31430).

అథ్లెటిక్స్: రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల (95733 40199).

బాల్ బ్యాడ్మింటన్: చాగల్లు మండలం బ్రాహ్మణగూడెం జెడ్పీ హైస్కూలు (70139 12527), అనపర్తి జెడ్పీ హైస్కూల్ (99893 44229), బిక్కవోలు మండలం బలభద్రపురం జెడ్పీ హైస్కూల్ (76600 31234).

బాస్కెట్‌బాల్: రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల (98851 20003), ఎస్‌కేవీటీ కళాశాల (90143 29341), మల్లయ్యపేట ఏపీ పేపర్ మిల్లు (90301 36429), దానవాయిపేట మున్సిపల్ హైస్కూల్ (99591 18227), కొవ్వూరు ఎన్టీఆర్ క్రీడా ప్రాంగణం (79892 33403), నిడదవోలు జూనియర్ కళాశాల (95339 17302), అనపర్తిలో జెడ్పీ హైస్కూల్ (90006 32036), దేవరపల్లి జెడ్పీ హైస్కూల్ (98666 65207).

క్రికెట్: దేవరపల్లి జెడ్పీ హైస్కూల్ (99084 68106), అనపర్తి జెడ్పీ హైస్కూల్ (98664 86517).

ఫుట్‌బాల్: కడియం జెడ్పీ హైస్కూల్ (83282 75329), రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ కళాశాల (74169 88560, 95533 45324), దేవరపల్లి జెడ్పీ హైస్కూల్ (86882 24728)

హ్యాండ్‌బాల్: రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాల (94941 78885, 93470 65343), కొంతమూరు జెడ్పీ హైస్కూల్ (95533 13613, 91103 62354), బిక్కవోలు మండలం ఊలపల్లి జెడ్పీ హైస్కూల్ (98667 08810).

జూడో: కొవ్వూరు ఎచీవర్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ (99484 86935), కడియం జెడ్పీ హైస్కూల్ (83745 52220), అనపర్తి మండలం కొత్తూరు చైతన్య స్కూల్ (91777 44355).

కరాటే: రాజమహేంద్రవరం గౌతమ ఘాట్ (93472 42138), కొవ్వూరు ఎచీవర్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ (99484 86935).

కబడ్డీ: రాజమహేంద్రవరం దానవాయిపేట మున్సిపల్ హైస్కూల్ (97042 74293), ఆర్ట్స్ కళాశాల (99486 89091), రాజమహేంద్రవరం ఎస్ఎన్ఏ మున్సిపల్ హైస్కూల్ (98853 10089), కోరుకొండ మండలం శ్రీరంగపట్నం జెడ్పీ హైస్కూల్ (99491 79477).

ఖోఖో: రాజమహేంద్రవరం ఎస్ఎన్ఏ మున్సిపల్ హైస్కూల్ (98853 10089), కోరుకొండ మండలం శ్రీరంగపట్నం జెడ్పీ హైస్కూల్ (70366 69113).

సెపక్‌తక్రా: దేవరపల్లి జెడ్పీ హైస్కూల్ (99599 92802).

టేబుల్ టెన్నిస్: దేవరపల్లి జెడ్పీ హైస్కూల్ (95502 07825).

టైక్వాండో: కోరుకొండ విజన్ క్లబ్ (99899 73255).

టెన్నికాయిట్: దేవరపల్లి జెడ్పీ హైస్కూల్ (81061 83181), అనపర్తి జెడ్పీ హైస్కూల్ (90005 54343), కొవ్వూరు ఎన్టీఆర్ క్రీడా ప్రాంగణం (93926 69697), చాగల్లు జెడ్పీ హైస్కూల్ (63035 78996).

వాలీబాల్: సీతానగరం హైస్కూల్ (70136 86542), కొవ్వూరు మండలం ధర్మవరం జెడ్పీ హైస్కూల్ (94407 05207), అనపర్తి మండలం పొలమూరు జెడ్పీ హైస్కూల్ (96661 69998).

యోగా: నల్లజర్ల మండలం దూబచర్లలోని సంఘమిత్ర విద్యాలయం (99632 28040), రాజమహేంద్రవరం శ్రీనివాస రామానుజన్ మున్సిపల్ హైస్కూల్ (73969 95595), అనపర్తి మండలం కొత్తూరు శ్రీచైతన్య స్కూల్ (88867 77386).

చదరంగం: రాజమహేంద్రవరం మున్సిపల్ హైస్కూల్ (98853 10089), నల్లజర్ల మండలం దూబచర్ల (వంశీకృష్ణ – 94921 23401).

కిక్ బాక్సింగ్, బాక్సింగ్: బొమ్మూరు జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాల (99598 93345), రాజమహేంద్రవరం ఏకే కళాశాల (83414 12761).

50 క్రీడా శిబిరాల ఏర్పాటు



జిల్లా వ్యాప్తంగా 50 క్రీడా శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేస్తున్నాం. క్రీడా సామగ్రి కొనుగోలు, సర్టిఫికెట్ల కోసం ఒక్కో శిబిరానికి రూ.7 వేల చొప్పున రూ.3.50 లక్షలు కేటాయించారు. బాల బాలికలు వేర్వేరుగా శిక్షణ ఇస్తాం. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఆయా క్రీడా శిబిరాలను ఫోను ద్వారా సంప్రదించవచ్చు.

– డీఎంఎం శేషగిరి, జిల్లా ముఖ్య క్రీడా శిక్షకుడు

నాయీబ్రాహ్మణులకు తీపికబురు

- ఆలయాల్లో పారితోషికం రూ.20 వేలకు పెంపు
- జూన్ నుంచి చెల్లింపు
- ఇప్పటి వరకూ రూ.9 వేలు మాత్రమే



అన్నవరం: రాష్ట్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాల్లోని కేశఖండన శాలల్లో విధులు నిర్వహిస్తున్న నాయీ బ్రాహ్మణులకు మే నెల నుంచి కనీస పారితోషికం రూ.20 వేలు చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అలాగే ప్రస్తుతం రూ.25గా ఉన్న భక్తుల కేశఖండన టిక్కెట్టును సోమవారం నుంచి రూ.40కి పెంచుతూ ఆదేశాలు జారీ చేసింది. దీనివలన అన్నవరం దేవస్థానంలో సేవలందిస్తున్న 74 మంది నాయీబ్రాహ్మణులు లబ్ధి పొందనున్నారు. 'జాగ్రత్త.. నా దగ్గరా మీ వేషాలు.. మీ తోక ఎలా కత్తిరించాలో నాకు తెలుసు..' అంటూ 2018లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయీబ్రాహ్మణులపై కన్నెర్ర చేస్తూ చులకనగా మాట్లాడిన విషయం తెలిసిందే. అప్పట్లో పాదయాత్ర చేస్తున్న ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని నాయీ బ్రాహ్మణులు కలిసి తమ సమస్యలు వివరించగా అధికారంలోకి వచ్చాక పారితోషికం పెంచుతామని హామీ ఇచ్చారు. ఇందుకు అనుగుణంగా దేవస్థానాల్లోని కేశఖండన శాలలో పని చేసే నాయీ బ్రాహ్మణులకు నెలవారీ పారితోషికం రూ.9 వేల నుంచి రూ.20 వేలకు పెంచుతూ సీఎం జగన్ ప్రభుత్వం గత మార్చిలో నిర్ణయం తీసుకుంది. దీనిని మే ఒకటో తేదీ నుంచి అమలు చేసేందుకు ఉత్తర్వులు విడుదల చేసింది

క్లుప్తంగా

రేపు సాఫ్ట్‌బాల్ క్రీడాకారుల ఎంపిక

కాజులూరు: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థాయిలో మే 2న గొల్లపాలెంలో జూనియర్ బాలుర, బాలికల సాఫ్ట్‌బాల్ క్రీడాకారుల ఎంపికలు జరుగుతాయని జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జె.హరికృష్ణ, ఏఎస్ రామ్‌ప్రసాద్ తెలిపారు. ఆదివారం స్థానికంగా వారు విలేకరులతో మాట్లాడుతూ 2006 జనవరి 1 తరువాత జన్మించిన బాలురు, బాలికలు ఈ ఎంపికల్లో పాల్గొనవచ్చన్నారు. ఎంపికైన క్రీడాకారులు మే 26 నుంచి 28వ తేదీ వరకూ కడప జిల్లా రాయచోటిలో జరుగనున్న 10వ జూనియర్ అంతర్ జిల్లాల సాఫ్ట్‌బాల్ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొంటారన్నారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు ఒరిజినల్ ఆధార్‌కార్డు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, జనన ధ్రువపత్రం తీసుకురావాలన్నారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి ఎంపికలు ప్రారంభమవుతాయని, క్రీడాకారులు గంట ముందే క్రీడా మైదానంలో ఉండాలన్నారు. మరిన్ని వివరాలకు 99493 94568, 83099 65048 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని వివరించారు.

వేద మంత్రాల్లో ప్రకృతిని ప్రభావితం చేసే శక్తి

శ్రీబాల బ్రహ్మానంద సరస్వతి స్వామి


ద్రాక్షారామలో భక్తులకు అనుగ్రహ భాషణం చేస్తున్న శ్రీబాల బ్రహ్మానంద సరస్వతి స్వామి

రామచంద్రపురం రూరల్: ప్రకృతిని ప్రభావితం చేసే అపూర్వ శక్తి భారతీయ వేద మంత్రాలకు ఉందని నైమిశారణ్య పీఠాధిపతి శ్రీబాల బ్రహ్మానంద సరస్వతి స్వామి అనుగ్రహ భాషణం చేశారు. స్వామీజీ ఆదివారం ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామిని దర్శించుకున్నారు. తొలుత ఆయనకు ఆలయ ఈఓ పీటీవీవీ సత్యనారాయణమూర్తి (తారకేశ్వరరావు) ఆధ్వర్యంలో అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామివారికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో భక్తులకు స్వామీజీ అనుగ్రహ భాషణం చేశారు. బ్రిటన్‌లో శాస్త్రవేత్త మానసిక వికలాంగులకు వేద మంత్రాలను వినిపించినప్పుడు వారిలో మానసిక పరివర్తన వచ్చిందన్నారు. అటువంటి వేదాలను, వేద మంత్రాలను నిత్యం పలికే అర్చక వ్యవస్థను కాపాడుకోవాలని దేవదాయ శాఖ అధికారులకు, భక్తులకు స్వామీజీ సూచించారు.

శ్రీకారం చుట్టుకుంది పెళ్లి ఉత్సవం

- వధూవరులుగా అనంతలక్ష్మీ సత్యవతీదేవి, సత్యదేవుడు
- రత్నగిరిపై మొదలైన కల్యాణోత్సవాలు

అన్నవరం: రత్నగిరీశుని రూపం మనోహరం.. ఆ స్వామి వీక్షణం పరమానందం.. ఆ దేవదేవుని కల్యాణం జగత్కల్యాణ కారకం.. అలాంటి అపురూప వేడుకకు ఆదివారం అంకురార్పణ జరిగింది. అన్నవరం కొండపై వేంచేసిన సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్ల కల్యాణ వేడుక శ్రీకారం చుట్టుకుంది. వైశాఖ శుద్ధ దశమి కావడంతో అమ్మవారిని, స్వామివారిని వధూవరులను చేసే కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. పెళ్లి కుమారుడు, కుమార్తెలుగా దర్శనమిచ్చిన దేవతామూర్తులను చూసి భక్తకోటి పులకించింది. ఏడు రోజుల పాటు అంగరంగ వైభవంగా జరగనున్న శ్రీసత్యదేవుని దివ్య కల్యాణోత్సవాలకు ఆదివారం సాయంత్రం పండితులు శ్రీకారం చుట్టారు. ఆలయ ప్రాంగణంలోని అనివేటి మండపంలో స్వామి, అమ్మవార్లను వధూవరులను చేసే కార్యక్రమాన్ని వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య నిర్వహించారు.

నేటి రాత్రి సత్యదేవుని కల్యాణం

వైశాఖ శుద్ధ ఏకాదశి సోమవారం రాత్రి తొమ్మిది గంటల నుంచి రత్నగిరిపై నూతన కల్యాణ వేదిక వద్ద సత్యదేవుడు, అమ్మవార్ల దివ్య కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ కల్యాణానికి డిప్యూటీ సీఎం, దేవదాయ, ధర్మదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, రోడ్లు భవనాల శాఖా మంత్రి దాడిశెట్టి రాజా, ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత శ్రీపూర్ణచంద్రప్రసాద్, దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ, జిల్లా ఉన్నతాధికారులను ఆహ్వానించారు. స్వామివారి కల్యాణానికి ప్రభుత్వ ప్రతినిధిగా దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పిస్తారని ఈఓ తెలిపారు.

సీతారాములే పెళ్లి పెద్దలు

రత్నగిరి క్షేత్రపాలకులు సీతారాములు పెళ్లి పెద్దలుగా వెంట రాగా శ్రీసత్యదేవుడు, అమ్మవార్లను సాయంత్రం నాలుగు గంటలకు ఊరేగింపుగా అనివేటి మండపానికి తీసుకువచ్చారు. అక్కడ సర్వాంగ సుందరంగా అలంకరించిన కల్యాణ మండపంలో సత్యదేవుడు, అమ్మవార్లను, పక్కనే ఆసనంపై సీతారాములను ప్రతిష్ఠించి పండితులు ప్రత్యేక పూజలు చేశారు. స్వామి, అమ్మవార్లకు దేవస్థానం ఈఓ ఎస్ఎస్ చంద్రశేఖర్ అజాద్ దంపతులు, ధర్మకర్తల మండలి సభ్యులు, అసిస్టెంట్ కమిషనర్ రమేష్ బాబు పట్టు వస్త్రాలను సమర్పించారు. అనంతరం శుభం కోరుతూ ముత్తైదువులు పసుపు దంచారు. ఈ కార్యక్రమానికి హాజరైన ముత్తయిదువులకు తాంబూలాలు, భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ పూజాదికాలను దేవస్థానం వేదపండితులు గొల్లపల్లి ఘనాపాఠి, గంగాధరభట్ల గంగబాబు, యనమండ్ర శర్మ, చిట్టి శివ, ప్రధానార్చకులు ఇంద్రగంటి నరసింహమూర్తి, కోట శ్రీనివాస్, అర్చకులు నిర్వహించారు. ఉత్సవాల్లో తొలిరోజు రాత్రి అన్నవరం పుర వీధుల్లో పెళ్లి పెద్దలు సీతారాములను వెండి ఆంజనేయ వాహనంపై ఊరేగించారు.

కల్యాణం వీక్షించేలా..

ఈ సారి భక్తులంతా స్వామివారి కల్యాణాన్ని ప్రత్యక్షంగా వీక్షించేలా విస్తృత ఏర్పాటు చేశారు. దూరంగా ఉండే భక్తులకు కల్యాణం స్పష్టంగా కనిపించేందుకు టీవీ, స్క్రీన్‌ల ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేస్తున్నారు. కల్యాణం అనంతరం భక్తులకు ప్రసాదం, అక్షితల ప్యాకెట్లను కల్యాణ వేదిక ఎదురుగా ఉన్న సర్క్యులర్ మండపంతో పాటు మరో మూడు చోట్ల పంపిణీ చేయనున్నారు. అలాగే అన్నదాన భవనంలో భక్తులకు భోజన సౌకర్యం కల్పిస్తున్నారు. భక్తుల వాహనాలను కొండ దిగువ కళాశాల మైదానం వరకే అనుమతిస్తారు. అక్కడి నుంచి ప్రత్యేక బస్‌ల ద్వారా కొండపైకి వెళ్లేలా ఏర్పాట్లు చేశారు. ఇందుకు గాను 15 ఉచిత బస్‌లను కొండపైకి నడుపుతున్నారు. 300 మంది పోలీసులతో ప్రత్యేక బందోబస్తు నిర్వహిస్తున్నారు. చిన్న వాహనాలలో వచ్చే భక్తులకు సత్యగిరిపై పార్కింగ్ ఏర్పాట్లు చేశారు. అక్కడి నుంచి భక్తులను స్వామివారి ఆలయానికి, కల్యాణ వేదిక వద్దకు తీసుకురానున్నారు. భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు జరుగుతున్నాయి.


కళావేదికపై సత్యదేవుని ఎదుర్కోలు ఉత్సవం నిర్వహిస్తున్న పండితులు

వైభవంగా ఎదుర్కోలు ఉత్సవం

సత్యదేవుని ఎదుర్కోలు ఉత్సవాన్ని రామారాయ కళావేదికపై రాత్రి నిర్వహించారు. సర్వాంగ సుందరంగా అలంకరించిన సత్యదేవుడు, అమ్మవారిని ఊరేగింపుగా ఆలయం నుంచి కళావేదిక వద్దకు తీసుకువచ్చి ప్రతిష్ఠించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. పండితుల్లో కొంతమంది స్వామివారి వైపు, మరి కొంతమంది అమ్మవారి వైపు ఉండి స్వామివారే గొప్ప అంటే అమ్మవారే గొప్ప అని హాస్య చతురోక్తులతో కార్యక్రమాన్ని రక్తికట్టించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు వేదపండితులు నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ప్రముఖ వేదపండితులు చిర్రావూరి శ్రీరామశర్మ హాజరయ్యారు. దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ అజాద్ దంపతులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



సత్యదేవుడు, అమ్మవారికి నూతన పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ఈఓ చంద్రశేఖర్ అజాద్ దంపతులు, పసుపు దంచుతున్న ముత్తైదువలు

ప్రకృతి ఒడిలో విడిది

- సేద తీరేందుకు ప్రత్యేక హట్‌లు
- కోరంగిలో పర్యాటకుల కోసం ఏర్పాట్లు


కోరంగిలో సర్వాంగ సుందరంగా ఏర్పాటు చేసిన పర్యాటక హట్‌లు


కోరంగి ఫారెస్ట్ కాంప్లెక్స్‌లోని వీఐపీ వసతి గృహం

తాళ్లరేవు: తూర్పున ప్రముఖ పర్యాటక కేంద్రంగా రూపుదిద్దుకున్న కోరంగి అభయారణ్యాన్ని సందర్శించే పర్యాటకుల కోసం అటవీ శాఖ ప్రత్యేక హట్‌లను (వసతి గృహాలు) అందుబాటులోకి తీసుకొచ్చింది. దేశంలోనే రెండో అతిపెద్ద మడ అటవీ ప్రాంతమైన కోరంగి అభయారణ్యాన్ని వేలాది మంది పర్యాటకులు సందర్శిస్తుంటారు. అయితే దూర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులు విడిది చేసేందుకు అటు కాకినాడ లేదా ఇటు యానాం, అమలాపురం వెళ్లాల్సి వచ్చేది. అందుకే కోరంగిలోనే పర్యాటకులు సేదతీరడంతో పాటు అక్కడ బస చేసేందుకు వీలుగా అత్యాధునిక సౌకర్యాలతో అటవీ శాఖ వసతి గృహాలను ప్రారంభించింది. కోరంగి పంచాయతీలోని ఫారెస్ట్ కాంప్లెక్స్ ప్రాంగణంలో ఉన్న మూడు హట్‌లతో పాటు ఫారెస్ట్ భవనాన్ని సైతం పర్యాటకులకు అందుబాటులోకి తీసుకొచ్చింది.

ఆధునిక హంగులు.. సౌకర్యాలు

హట్‌ల్లోని ప్రతి రూమ్‌లోనూ డబుల్ కాట్ బెడ్, ఏసీ, టీవీ, ఇన్వెర్టర్ తదితర ఆధునిక హంగులు, సౌకర్యాలను కల్పించారు. పర్యాటకులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయడంతో పాటు పూర్తి స్థాయిలో రక్షణ ఉండేలా చర్యలు చేపట్టారు. అంతే కాకుండా ప్రాంగణంలో ఉన్న బయోడైవర్సిటీ భవనాన్ని సందర్శిస్తే కోరంగి మడ అభయారణ్యం విశేషాలను తెలుసుకోవచ్చు. ప్రకృతి ఒడిలో సేద తీరాలనుకునే వారికి ఈ హట్‌లు ఒక వరంగా చెప్పవచ్చు. అటవీశాఖ ఏర్పాటు చేసిన ఈ హట్‌ల్లో ఒకరోజు బస చేసేందుకు రూ.1,500 చెల్లించాల్సి ఉంటుంది. ఫారెస్ట్ కాంప్లెక్స్‌లో ఉన్న అటవీ శాఖ అధికారులను సంప్రదిస్తే ఈ రూములను కేటాయిస్తారు. కుటుంబ సభ్యులతో వచ్చే పర్యాటకుల సౌకర్యార్థం ఒకప్పటి ఫారెస్ట్ బంగ్లాను సైతం వీఐపీ రూముగా అద్దెకు ఇవ్వనున్నారు. ఈ బంగ్లాకు రోజుకు రూ.3 వేల చొప్పున చార్జి చేస్తారు. కోరంగి మడ అటవీ ప్రాంతాన్ని సందర్శించి ప్రకృతి ఒడిలో సేద తీరాలనుకునే వారికి ఇదొక చక్కని అవకాశంగా చెప్పొచ్చు.

త్వరలో ఆన్‌లైన్ బుకింగ్



పర్యాటకులు బస చేసేందుకు వీలుగా ఆధునిక సౌకర్యాలతో హట్‌లు ఏర్పాటు చేశాం. ప్రస్తుతం మా సిబ్బంది ద్వారా గదులను కేటాయిస్తున్నాం. త్వరలో ఆన్‌లైన్‌లో కూడా బుక్ చేసుకునే సౌకర్యాన్ని తీసుకు రాబోతున్నాం. ఇతర వివరాల కోసం 89859 52875 ఫోన్ నంబరులో సంప్రదించవచ్చు.

–ఎస్ఎస్ఆర్ వరప్రసాద్, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్, కోరంగి అభయారణ్యం

విలువలతో కూడిన విద్య అవసరం

సదస్సులో తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు


సదస్సులో మాట్లాడుతున్న తిరుమలరావు

రాజమహేంద్రవరం రూరల్: ప్రస్తుత పోటీ ప్రపంచంలో పిల్లలు ఇంజినీరింగ్, వైద్య విద్యలలో విజయం సాధించాలంటే విలువలతో కూడిన చదువు అవసరమని తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు అన్నారు. ఆదివారం రాజమహేంద్రవరం తిరుమల విద్యాసంస్థల ఆవరణలో 6, 7, 8, 9, 10వ తరగతుల్లోకి ప్రవేశించే విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఐఐటీ, ఎన్ఐటీ, మెడికల్ కాలేజీలలో ప్రవేశ పరీక్షలపై అవగాహన సదస్సు జరిగింది. దీనికి 12 వేల మంది హాజరైనట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా తిరుమలరావు మాట్లాడుతూ పిల్లల భవిష్యత్ నిర్మాణంలో తల్లిదండ్రులు, స్కూల్ ప్రముఖపాత్ర వహిస్తాయన్నారు. తల్లిదండ్రులు పిల్లలకు జీవనాన్ని ఇస్తే, పుట్టిన తరువాత తల్లిదండ్రులకు పిల్లలే జీవితంగా మారతారన్నారు. అటువంటి పిల్లల భవిష్యత్తు గురించి అహర్నిశలు ఆలోచించే తల్లిదండ్రులు ముఖ్యంగా వారికి ఆస్తులను అందివ్వడం కాదు.. వారి జీవిత భవిష్యత్తుకు అమోఘమైన మార్గాన్ని చూపిస్తూ ఉన్నత విద్యను అందించాలన్నారు. నేటి కాలంలో పిల్లల బాహ్యప్రవర్తనను ఎప్పటికప్పుడు గమనించుకోవాలని, దానిద్వారా సమగ్ర మానసిక పరిపక్వత, విలువలతో కూడిన జీవన విధానం నేర్చుకుంటారని ఆయన వివరించారు. తిరుమల విద్యాసంస్థల డైరెక్టర్ నున్న సరోజినీదేవి మాట్లాడుతూ కుటుంబ వ్యవస్థ అనేది మంచి సమాజం ఏర్పడడానికి కారణం అవుతుందని, అది కేవలం అమ్మతోనే సాధ్యమవుతుందన్నారు. పిల్లల ఎదుగుదల, అభివృద్ధిలో తల్లి పాత్ర వెలకట్టలేనిదని, ప్రతి తల్లి తమ పిల్లలకు విలువలతో కూడిన విద్యను అందించే ప్రయత్నం చేయాలని తెలిపారు. సదస్సులో అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్‌బాబు, ప్రిన్సిపాల్ వి.శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఓఎన్జీసీ సైక్లోథాన్


సైక్లోథాన్‌లో పాల్గొన్న అమిత్ నారాయణ్ తదితరులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): భారతదేశాన్ని పర్యావరణ హితంగా తీర్చిదిద్దాలన్న ప్రధాని నరేంద్రమోదీ పిలుపును సాకారం చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఓఎన్జీసీ రాజమండ్రి ఎసెట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఎసెట్ మేనేజర్ అమిత్ నారాయణ్ అన్నారు. ఇంధనం పొదుపుపై ప్రజలను చైతన్యవంతం చేయడానికి ఓఎన్జీసీ ఆధ్వర్యంలో స్థానికంగా ఏర్పాటు చేసిన సైక్లోథాన్‌ను ఆదివారం ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఓఎన్జీసీ గోల్ఫ్ క్లబ్ నుంచి ప్రారంభమైన ర్యాలీ ఏవీ అప్పారావు రోడ్డు, నందం గనిరాజు జంక్షన్, వై.జంక్షన్ మీదుగా తిరిగి గోల్ఫ్ క్లబ్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా ఎసెట్ మేనేజర్ అమిత్ నారాయణ్ మాట్లాడుతూ దీనిలో భాగంగా ఓఎన్జీసీ 2030 నాటికి 45 శాతం సంప్రదాయ వనరులను వినియోగించుకుంటుందన్నారు.

ఇప్పటికే రాజమహేంద్రవరం ఎసెట్ ఈ శాతానికి చేరువలో ఉందన్నారు. ముఖ్యంగా సంస్థ ఇంధన వృథాను అరికట్టడం, లీకేజీలను గుర్తించడంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తుందన్నారు. అంతేకాకుండా గృహిణులు, యువతకు సంప్రదాయ పునరుత్పాదక శక్తిపై క్విజ్ పోటీలు, అవగాహన కార్యక్రమాలను ఓఎన్జీసీ నిర్వహిస్తోందన్నారు. ఈ మహోద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అమిత్‌నారాయణ్ పిలుపునిచ్చారు. ర్యాలీలో ఓఎన్జీసీ అధికారులు, ఎస్పీఎఫ్ సిబ్బంది, కేంద్రీయ విద్యాలయ విద్యార్థులు పాల్గొన్నారు.

శవ జాగారం..


రాజమహేంద్రవరం బోధనాసుపత్రి వద్ద ఆందోళన చేస్తున్న మృతుడి బంధువులు

- పోస్టుమార్టం విధులకు అందుబాటులో లేని వైద్యులు
- ప్రభుత్వాసుపత్రి వద్ద మృతుడి బంధువుల ధర్నా

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): వైద్య రంగానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తూ, ఎన్నో మార్పులు తీసుకువస్తోంది. ప్రభుత్వాసుపత్రికి వచ్చిన ప్రతి ఒక్కరికీ కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందించే లక్ష్యంతో సౌకర్యాలు సమకూర్చుతోంది. కానీ రాష్ట్ర ప్రభుత్వ ఆశయానికి బోధనాసుపత్రి వైద్యాధికారులు కొందరు తూట్లు పొడుస్తున్నారు. తాజాగా జరిగిన సంఘటనే ఇందుకు ఉదాహరణ. రాజానగరం పోలీస్ స్టేషన్ పరిధి గాడాల వద్ద శివరామకృష్ణ (22) శనివారం రాత్రి మోటార్ సైకిల్‌పై నుంచి పడి అక్కడికక్కడే మృతి చెందాడు. అతని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రాత్రి సమయంలో పోస్టుమార్టం నిర్వహించే వీలులేకుండా పోయింది. ఆదివారం ఉదయం పోలీసులు వచ్చి వివరాలు సేకరించి వారి పని పూర్తి చేసుకుని వెళ్లిపోయారు. అయితే ఆదివారం కావడంతో ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించేందుకు వైద్యులు లేరు. దీంతో మృతుడి కుటుంబ సభ్యులు, మరికొందరు ఆసుపత్రి వద్ద ఆందోళనకు దిగారు. అయినా ఆసుపత్రి వైద్యాధికారుల నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో రోడ్డుపై ధర్నా చేశారు. ఆ ప్రాంతంలో పూర్తిగా ట్రాఫిక్ స్తంభించింది. అక్కడకు పోలీసులు చేరుకుని పరిస్థితిని చక్కదిద్దేందుకు ప్రయత్నించారు. ఈ విషయం తెలిసిన జిల్లా కలెక్టర్ కె.మాధవీలత వెంటనే చొరవ తీసుకున్నారు. రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో వైద్యులెవరూ అందుబాటులో లేకపోవడంతో వెంటనే ఆమె జిల్లా ఆసుపత్రుల సమన్వయాధికారి సనత్‌కుమారితో మాట్లాడారు. దీంతో డీసీహెచ్ఎస్ కొవ్వూరు ప్రభుత్వాసుపత్రి నుంచి వైద్యుడిని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి పంపి పోస్టుమార్టం పూర్తి చేయించారు. దీంతో వివాదం సద్దుమణిగింది.

సీపీఎస్‌పై కోర్టును ఆశ్రయిస్తాం

ప్రకాశంనగర్ (రాజమహేంద్రవరం సిటీ): కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్) విషయంలో కోర్టును ఆశ్రయిస్తామని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ చెప్పారు. ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఆదివారం రాజమహేంద్రవరంలో జరిగింది. ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, సీపీఎస్ రద్దు సాధ్యం కాదన్న వాదనను ఇప్పటికే పలు రాష్ట్రాలు తోసిపుచ్చాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సీపీఎస్‌ను రద్దు చేసి పాత పింఛను విధానం(ఓపీఎస్)ను పునరుద్ధరించాలని కోరారు. డీఎస్సీ ద్వారా ఎంపికైన 28వేల మందిని పర్మినెంట్ చేయాలని, ఉద్యోగులు, పెన్షనర్ల ఆర్థిక ప్రయోజనాల బకాయిలను నిర్దిష్ట కాలపరిమితి లోపు చెల్లించాలని కోరారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమ కార్యాచరణపై మే 5న ప్రభుత్వానికి నోటీసు అందిస్తామని, అక్టోబర్ 31 వరకు దశలవారీగా ఆందోళనలు నిర్వహిస్తామని చెప్పారు. అప్పటికీ ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ రాకపోతే నవంబర్ ఒకటో తేదీ నుంచి నిరవధిక సమ్మె చేస్తామని సూర్యనారాయణ తెలిపారు. ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి జి.ఆస్కారరావు, ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌రాజు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

దేవరపల్లి: పురుగు మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. లక్ష్మీపురం గ్రామానికి చెందిన సతిని అనీను (32) గత నెల 25న పొలాల్లోకి వెళ్లి పురుగు మందు తాగాడు. దీనిపై వెంటనే భార్యకు ఫోన్‌లో సమాచారం ఇచ్చాడు. భార్య తన కుటుంబ సభ్యులకు చెప్పగా కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు.